క్లుప్తంగా

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



డీఎల్‌డీవోతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును బొబ్బిలి డీఎల్‌డీవో ఎం.కిరణ్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎల్‌డీవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఎంపీపీని కలవగా, ఆయనకు ఎంపీపీ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీ, సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని డీఎల్‌డీవో తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, మండల జేసీఎస్ కన్వీనర్ సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లపై చెత్త వేసిన వారికి జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆమె.. శ్వేతా చలపతి పాఠశాల వద్ద ఉన్న ఓ బంకు వద్ద చెత్త ఉండడాన్ని గమనించి, రోడ్లపై చెత్త వేయకుండా చూడాలన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో తాను పర్యటిస్తానని, ఎక్కడైనా చెత్తాచెదారం ఉంటే చర్యలు తప్పవన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు నిత్యం అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందించాలి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: పట్టణంలోని మెంతిపేట కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆయన.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సిరిపురపు కృష్ణకు చెందిన ఇంటికి నిప్పంటుకుని, విలువైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, నిత్యావసర సరుకులు, దుస్తులన్నీ కాలిపోయాయని, అధికారులు నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలందించాలి

బొబ్బిలిరూరల్: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త కల్పన మంగళవారం సందర్శించారు. కేంద్రానికి వస్తున్న దివ్యాంగులైన చిన్నారులకు తప్పనిసరిగా ఫిజియోథెరపీ సేవలందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అక్కడికి వస్తున్న పిల్లల వివరాలను ఎంఈవో లక్ష్మణరావును అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే వారికి నెలకు రూ.300 చొప్పున చెల్లించాలన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

రాజాం సిటీ: ఉద్యోగులంతా అంకితభావంతో పనిచేసి, ప్రజలకు సకాలంలో సేవలందించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన.. పీఆర్ వన్‌యాప్, గ్రామసభల నిర్వహణ, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రభుత్వ కార్యక్రమాలను బాధ్యతాయుతంగా నిర్వహించాలని తెలిపారు.

పింఛన్ల పంపిణీ

రాజాం/రేగిడి/తెర్లాం/రామభద్రపురం/బాడంగి: మండలాల్లోని అన్ని గ్రామాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. బాడంగి, రాజాం, రేగిడి, తెర్లాం మండలాల్లో 96 శాతం, రామభద్రపురంలో 97 శాతం మేర పింఛన్ల పంపిణీ జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

రేగిడి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా మెరుగైన ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ సూచించారు. మండలంలోని ఉంగరాడమెట్ట, చిన్నపుర్లి, పెద్దపుర్లి అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించిన ఆమె.. కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు రికార్డులు పరిశీలించి, పలు సూచనలు చేశారు.



బ్రాహ్మణీదేవి



మహేశ్వరీదేవి



కౌమారీదేవి



వైష్ణవీదేవి



వారాహీదేవి



ఇంద్రాణీదేవి



చాముండేశ్వరీదేవి



శ్రీమహాలక్ష్మి



మూలవిరాట్

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు!

- రేపటి నుంచి దసరా ఉత్సవాలు
- ముస్తాబైన నవదుర్గామాత ఆలయం
- ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు సంబరాలు
- తొమ్మిది రోజులూ ప్రత్యేక పూజలు, హోమాలు
- దర్శనానికి తరలిరానున్న వేలాదిమంది భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయ ధర్మాదాయ శాఖ

రాజాం: దేవీ నవరాత్రి ఉత్సవాల(దసరా)కు స్థానిక పట్టణంలోని పాత ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని నవదుర్గామాత ఆలయం ముస్తాబైంది. శరన్నవరాత్రి వేడుకల ఏర్పాట్ల నేపథ్యంలో గత నాలుగు రోజులుగా అమ్మవారి దర్శనాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ నిలిపివేసింది. ఈ నెల 3వ తేదీ నుంచి ఇక్కడ అమ్మవారి దర్శనాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 12వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఈ ఆలయంలో దసరా వేడుకలతో పాటు ఆలయ 35వ వార్షికోత్సవం పురస్కరించుకుని, యాత్రా ఉత్సవాలు నిర్వహించనున్నారు. భవానీ దీక్ష చేపట్టే వేలాదిమంది భక్తులతో పాటు ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి చాలా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, ఇక్కడి అమ్మవారిని ఉత్సవ సమయంలో దర్శించుకుంటారు. దసరా ఉత్సవాలు జరిగే తొమ్మిది రోజులూ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

తొమ్మిది దుర్గామాతల విగ్రహాలు..

రాజాం నవదుర్గామాత ఆలయంలో తొమ్మిది దుర్గామాతల విగ్రహాలు ప్రతిష్ఠించారు. సాధారణంగా దుర్గాదేవి ఆలయంలో ఒక విగ్రహమూర్తి మాత్రమే ఉంటుంది. ఇక్కడ అలా కాకుండా గర్భగుడిలో నవదుర్గాదేవి కొలువుదీరగా, చుట్టూ బ్రాహ్మణీదేవి, మహేశ్వరీదేవి, కౌమారీదేవి,వె వైష్ణవీదేవి, వారాహీదేవీ, ఇంద్రాణీదేవీ, చాముండేశ్వరీదేవీ, శ్రీమహాలక్ష్మిలు కొలువుదీరారు. ఇలా తొమ్మిది విగ్రహమూర్తులతో ఆలయం ఉండడంతో ఉత్తరాంధ్రలో ఈ ఆలయానికి విశిష్టత పెరిగింది. ప్రతిఏటా వేలాది మంది భవానీ భక్తులు ఇక్కడకు వచ్చి, మండల దీక్షలు, అర్ధమండల దీక్షలు, నవరాత్రి దీక్షల మాలలు వేసి, దసరా అనంతరం ఇరుముడులు, మొక్కులూ ఇక్కడే చెల్లిస్తారు. దసరా రోజు దుర్గాదేవికి పూజలు చేసిన అనంతరం, పక్కనే ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తి తిరువీధి ప్రారంభంతో ఉత్సవాలు ముగుస్తాయి. వేలాదిగా తరలివచ్చే భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. భవానీ భక్తులతో ఆలయ ఆవరణం మొత్తం ఎర్రదనాన్ని సంతరించుకుంటుంది.





నవదుర్గామాత ఆలయం (ఇన్‌సెట్‌లో అమ్మవారు)

రోజుకో అవతారంలో దర్శనం..

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆలయం వద్ద ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు రోజుకో అవతారంలో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అర్చకులు రామాయణ శ్రీనివాసరావుశర్మ తెలిపారు. ప్రతిరోజూ కుంకుమ పూజలు, హోమాలు చేయడం జరుగుతుంది. ఉత్సవ రోజుల్లో ఆలయ ఆవరణలో రోజుకో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, భవానీ దీక్షా గురువులు కూరాడ వెంకటరావు, దాసరి అప్పారావుల ఆధ్వర్యంలో మొత్తం కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షిస్తుంది.

ఆలయ విశేష చరిత్ర..

రాజాం నవదుర్గామాత ఆలయానికి విశేష చరిత్ర ఉంది. బొబ్బిలిరాజు తాండ్ర పాపారాయుడు కాలంలో ఇక్కడి నవదుర్గామాత విగ్రహం ప్రతిష్టించి, ఆలయం నిర్మించినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. తాండ్రపాపారాయుడు తదనంతరం ఆలయం కనుమరుగు కాగా, 1983లో వానపల్లి తమ్మయ్య గురువు ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనతికాలంలోనే ఆలయ నిర్మాణం జరిగి, 1988లో అంగరంగ వైభవంగా ఆలయాన్ని ప్రతిష్టించారు. ఎనిమిది నవదుర్గల విగ్రహమూర్తులతో పాటు ఆలయ గర్భగుడిలో నవదుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించి, ప్రాణప్రతిష్ట చేశారు. ఏటా వేలాది మంది భక్తులు ఆలయానికి రావడంతో ఈ ఆలయం పక్కనే 2004లో జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని కూడా నిర్మించారు. ఈ ఆలయాన్ని ఓ వైపు వానపల్లి కుటుంబీకులు ధర్మకర్తల మండలి తరఫున ఆలయ అభివృద్ధిపై దృష్టిసారించగా, మరోవైపు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయంలో విశేష పూజలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోంది. ఏటా దేవాదాయ శాఖ పర్యవేక్షణలో దసరా ఉత్సవాలు జరుగుతుంటాయి.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు..

నవదుర్గామాత దర్శనానికి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇక్కడి ఆలయానికి చాలా విశిష్టత ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. వారికి ప్రశాంత వాతావరణంలో దైవదర్శనం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

–ఆర్.లక్ష్మి, దేవదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్, రాజాం

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే పోటీ పరీక్షలు



తెర్లాం: విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ



రాజాం సిటీ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

తెర్లాం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్(ప్రతిభా పరీక్ష) మంగళవారం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కాగా, విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను పారద్రోలేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక, సమగ్ర శిక్ష సౌజన్యంతో చెకుముకి ప్రతిభా పరీక్ష పోటీలు మంగళవారం నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవ్వగా, పాల్తేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచి, జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు.

రాజాం సిటీ: మండలంలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలకు హాజరైన విద్యార్థుల్లో 36 మంది విశేష ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆరుగురు, ప్రైవేటు పాఠశాలల నుంచి ఆరుగురు.. ఎంపికైన వారిలో ఉన్నారని జేవీవీ గౌరవాధ్యక్షుడు జె.నీలయ్య తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీవీ వసంతకుమార్, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పి.వేణుగోపాల్, పి.చైతన్య, పి.గౌరీశ్వరరావు, నీలకంఠేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సీబీఎం పాఠశాలను కొనసాగించాల్సిందే..



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నేతలు

బొబ్బిలి: పట్టణంలోని సీబీఎం బాలికోన్నత పాఠశాలను కొనసాగించాల్సిందేనని వామపక్ష, ప్రజాసంఘాల నేతలు, ఏఐఎస్ఎఫ్(అఖిల భారత విద్యార్థి సమాఖ్య) నాయకులు పట్టుబట్టారు. ఇదే విషయమై వారు అదే పాఠశాల వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. పాఠశాల గుర్తింపు రెన్యువల్ చేయకుండా, పాఠశాల నడపకుండా జాప్యం చేస్తున్న స్కూల్ కరస్పాండెంట్ ఎం.రత్నకుమార్ తీరుపై మండిపడ్డారు. ఉదయం అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా చేరేందుకు బర్లి గ్రామానికి చెందిన మరిపి వరలక్ష్మితో పాటు మరో వ్యక్తి వెళ్లగా, అక్కడ విద్యార్థులు లేకపోవడం చూసి ఆశ్చర్యపోయారు. విధుల్లో చేరాలని తమకు జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చిన కరస్పాండెంట్‌కు ఫోన్ చేస్తే ఆయన స్పందించకపోవడంతో చేసేదేమీ లేక అక్కడే కాసేపు కూర్చొని, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజాసంఘాల నేతలు పలువురు వారి వద్దకు చేరుకుని, వారికి జరిగిన మోసం తెలుసుకుని, ఆందోళన బాటపట్టారు. కరస్పాండెంట్ రత్నకుమార్ మరెంతమందిని మోసం చేస్తాడని ధ్వజమెత్తారు. పాఠశాల గుర్తింపు రద్దు, కొనసాగింపు, తరలింపు, ఉపాధ్యాయుల కేటాయింపు ఇలా అన్నింటిల్లో ఆయన ఎంతోమందిని మోసం చేస్తున్నాడని, ఇంకెంతమంది అమాయకులను మోసం చేస్తాడో అంతుచిక్కడం లేదని సీపీఐ నాయకుడు కోట అప్పన్న, సీపీఎం నాయకుడు గోపాలం, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మీనాయుడు తదితరులు దుయ్యబట్టారు. అతడిపై అధికారులు కూడా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో కూడా అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి, చర్యలు తీసుకోవాలని, పాఠశాల కొనసాగేలా చూడాలని కోరారు. ఆ తర్వాత పాఠశాల వద్దకు తొలుత రత్నకుమార్ అనుయాయులు, ఆ తర్వాత రత్నకుమార్ రావడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. చేసిన మోసంపై నిలదీసి, ఎలాగైనా పాఠశాల కొనసాగించే వరకు పోరాటం ఆగదని ఆందోళనకారులు హెచ్చరించారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, తదితరులు

రాజాం సిటీ: ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి పాలకొండ రోడ్డులోని లేబర్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా ఉచిత ఇసుక విధానం అమలు చేయకపోవడం దారుణమని వారు అన్నారు. ఇసుక కష్టాలు కొనసాగుతుండడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఉచితంగా ఇసుక ఇవ్వాలని కోరారు. అలాగే సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నడపడంతో పాటు అర్హులైన వారికి పథకాలు అమలు చేయాలన్నారు. అనంతరం లేబర్ ఆఫీసర్ కొండలరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కె.సురేష్, విశ్వనాథం, కార్మికులు పాల్గొన్నారు.

డీఎల్‌డీవోగా కిరణ్‌కుమార్



కిరణ్‌కుమార్

బొబ్బిలిరూరల్: డీఎల్‌డీవో(డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్)గా పి.కిరణ్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి పనులను సక్రమంగా పర్యవేక్షించి, బొబ్బిలి డివిజన్ పరిధిలోని ఆరు మండలాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ప్రజాదర్బార్ రేపు

తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బేబీనాయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీన నిర్వహిస్తున్నారని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి నర్సుపల్లి వెంకటేశ్వరరావు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటనాయుడు మంగళవారం తెలిపారు. ప్రతీ మండలంలో ఒకరోజు ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజాసమస్యలపై వినతిపత్రాలు స్వీకరించాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

సంతకవిటి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బుధవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ అధికారి వసంతరావు మంగళవారం తెలిపారు. శ్రీవేంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రి, విజయనగరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో రోగులకు తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. శస్త్రచికిత్స అవసరమై, చేసుకోవాలను వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి వీణల కేంద్రం వద్ద వీణల తయారీలో శిక్షణ పొందిన పలువురు కళాకారులకు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చేతులమీదుగా మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. విశాఖపట్నానికి చెందిన హస్తకళల కేంద్రం(లేపాక్షి) మేనేజర్ ఎ.కార్తీక్ మాట్లాడుతూ దేశంలో బొబ్బిలి వీణలకు ఎంతో ప్రత్యేకత ఉందని, గ్లోబల్ సమ్మిట్‌లో కూడా అతిథులకు బొబ్బిలి వీణలను బహుమతిగా ఇస్తున్నామన్నారు. బొబ్బిలి వీణల గొప్పతనం, విశిష్టత, తయారీని భవిష్యత్ తరాలకు వివరించాలని సూచించారు.

'ఈ-శ్రమ్'లో నమోదు కావాలి

రాజాం: భవన నిర్మాణ కార్మికులతో పాటు పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులంతా ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు కావాలని రాజాం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు కోరారు. మంగళవారం స్థానిక పట్టణంలో పలుచోట్ల పర్యటించిన ఆయన ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ పోర్టల్‌లో సభ్యత్వం పొందిన వారికి ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు, పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.1 లక్ష బీమా వర్తిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9492555043, 9492555044ను సంప్రదించాలని కోరారు.

'పొలం పిలుస్తోంది'తో రైతుకు ప్రయోజనం



కొట్టక్కిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో వెంకటయ్య



సంతకవిటి: అవగాహన కల్పిస్తున్న ఏవో నవీన్

రామభద్రపురం: పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు ప్రయోజనమేనని, ప్రతీ రైతు ఆ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి కోరారు. మండలంలోని కొట్టక్కి, తారాపురం గ్రామాల్లో జెడ్పీటీసీ ఆధ్వర్యంలో ఏవో వెంకటయ్య పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ, పశువైద్య శాఖల అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి, పంటపొలాలు, పాడిపశువులను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై, పంటల సంరక్షణ చర్యలు, అధిక దిగుబడులకు అనుసరించాల్సిన సాగు విధానాలను వివరించారు. అలాగే పశువులకు వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అప్పికొండ అనురాధ, బెవర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను ఏవో పైల నవీన్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తుల స్వాతీశ్వరరావు, వెటర్నరీ డాక్టర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని పాల్తేరు, బొత్సవానివలస గ్రామాల్లో ఏవో కె.శిరీష ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, అధిక దిగుబడులకు మెలకువలు, నూతన సాగు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యజ్జల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయివలస, కొమెర గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, రైతులకు సాగులో మెలకువలు, నూతన వ్యవసాయ పద్ధతులను వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు వివరించారు. కార్యక్రమంలో ఏవో జి.మురళీకృష్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో తట్టికోట కన్నబాబు పాల్గొని, సాగులో అధిక దిగుబడులకు పలు సూచనలు, సలహాలు చేశారు.

'మత్తు'తో జీవితాలు నాశనం

వంగర: మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా జీవితాలు నాశనమవుతాయని ఎస్‌ఐ షేక్ శంకర్ హెచ్చరించారు. మండలంలోని మద్దువలస ప్రభుత్వం జూనియర్ కళాశాలలో సంకల్పం పేరిట అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు నేటి యువత బానిసలై, తమ జీవితాలు చెడగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత సన్మార్గంలో నడిచి, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని భీమవరం రామమందిరం వద్ద మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత అంతా మంచి అలవాట్లు అలవర్చుకుని, చెడు అలవాట్లను విడిచిపెట్టాలని సీఐ నారాయణరావు సూచించారు. గంజాయి, హెరాయిన్, కొకైన్, మద్యం వంటి మత్తపదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు. అలాగే సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: భీమవరంలో అవగాహన కల్పిస్తున్న సీఐ నారాయణరావు

బొబ్బిలి: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సీఐ సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మంగళవారం మాట్లాడిన ఆయన.. యువత, విద్యార్థులంతా చెడు అలవాట్లకు దూరంగా ఉండి, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలైన ఎంతోమంది జీవితాలు, వారి కుటుంబ సభ్యుల జీవితాలు నాశనమైన సంఘటనలు సమాజంలో చాలా ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ మంచి నడవడిక అలవర్చుకోవాలన్నారు.

'ఉపాధి' పనులకు ప్రణాళికలు రూపొందించండి



రామభద్రపురం: మాట్లాడుతున్న ఏపీడీ జనార్దన్

రామభద్రపురం: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, 2025–2026 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రణాళికలు రూపొందించాలని ఏపీడీ జనార్దన్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవో త్రినాధరావుతో కలిసి క్షేత్రస్థాయి సహాయకులు, సాంకేతిక సహాయకులతో మంగళవారం సమావేశమైన ఆయన.. రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. రింగ్ ట్రెంచెస్, బౌండరీ ట్రెంచెస్, ఫారంపాండ్స్, ట్రెంచ్ వర్క్‌లు తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేతనదారులకు గిట్టుబాటు అయ్యే వేతనం లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులతో మొక్కలు నాటే పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఉపాధి పనుల పారదర్శకతకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన జన్‌మన్ రేగా యాప్‌పై వేతనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

బొబ్బిలిరూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో పి.రవికుమార్ మంగళవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. ఉపాధి పనులకు సంబంధించి, ప్రణాళికలు రూపొందించాలని, రైతులకు మేలు చేకూరే ప్రాంతాల్లో పనులు జరిగేలా చూడాలన్నారు. అలాగే వేతనదారుల సంఖ్యను పెంచాలన్నారు. సమావేశంలో ఏపీడీ జనార్దనరావు, ఏపీవో లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.